క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని చిల్లకల్లు 220కేవీ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు జగ్గయ్యపేట పట్టణంతోపాటు అనుమంచిపల్లి, బలుసుపాడు, ఆటోనగర్, మంగొల్లు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు డీఈ జె.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంతోపాటు మండలంలోని తొర్రగుంటపాలెం, చిల్లకల్లు, అనుమంచిపల్లి, బలుసుపాడు, గండ్రాయి, అనుమంచిపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, షేర్‌మహ్మద్‌పేట, రామచంద్రునిపేట, గరికపాడు, వత్సవాయి మండలంలోని మంగొల్లు, ఇండస్ట్రీ ప్రాంతాలైన రామ్‌కో, హెచ్‌సీఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్(లైమ్‌స్టోన్ మైన్స్), మైలాన్, కోహెన్స్ కర్మాగారాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆయా వార్డుల్లో సాగుతున్న పారిశుద్ధ్య చర్యలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు హెల్త్, శానిటరీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శానిటరీ మేస్త్రీలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చూడాలన్నారు. అతిసారం ప్రబలకుండా ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. ఆహారం తీసుకునేముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న, పాడైపోయిన ఆహారపదార్థాలను తినరాదని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. మురుగు తొలగించిన వెంటనే బ్లీచింగ్, లైమ్ చల్లించాలని శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు.

భూసార పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన



గౌరవరం(జగ్గయ్యపేట): ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో లో రైతులు తమ పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) ఏడీఏ మునీషా సూచించారు. గౌరవరంలోని సచివాలయంలో భూసార పరీక్షలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే అవసరమైన ఎరువులు మాత్రమే వాడాలన్నారు. పచ్చిరొట్ట పంటలు వేసుకుని కలియ దున్నితే భూసారం పెరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నామని, వరి విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనంతరం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మీ, వీఏఏ యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు



నందిగామ: మండలంలోని మాగల్లు వైకుంఠ నారాయణక్షేత్రంలో శ్రీలక్ష్మినరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామివారికి విశేష పూజలు, తిరుమంజనం(అభిషేక)కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి వారికి పూజలు చేశారు. ఆయా పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గాంధీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ అన్నారు. ఆ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం పాతబస్తీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణశ్రీ మాట్లాడుతూ యోగాతో శరీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా భారతీయుల సొంతమైన పురాతన ప్రక్రియగా పేర్కొన్నారు. యోగాను విద్యార్థులు నిత్యం సాధన చేయడం ద్వారా అన్ని విధాలుగా విజయాలను సాధిస్తారని చెప్పారు. ఉపాధ్యక్షులు కేవీ పిచ్చయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నందిగామలోని నెహ్రూనగర్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణకుమారి, చిన్నారులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది



కంచికచర్ల మండలం మోగులూరు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

నందిగామ: నందిగామ పట్టణంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూనగర్, చక్రాలబజార్, వేపలతోపు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణకుమారి మాట్లాడుతూ ప్రీస్కూల్‌లోని చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం పౌష్టికాహారం అందించడంతోపాటు చిన్నారుల్లో మానసికొల్లాసానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా చందర్లపాడు మండలంలోని ఏటూరు అంగన్‌వాడీ కేంద్రంలోనూ గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని మోగులూరు, మున్నలూరు అంగనవాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులందరికీ పాఠశాలల్లో చేర్పిస్తున్నామని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూలు మెటీరియల్ ఎగ్జిబిషన్లు నిర్వహించి చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తమ పిల్లలను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఉత్సాహపరుస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు వేణు, అనురాధ, నాగలక్ష్మి, నారాయణమ్మ, వెంకట నర్సమ్మ, ఆయాలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నమోదుగపల్లిలో..

చిన్నమోదుగపల్లి(వత్సవాయి): గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. సీడీపీవో లక్ష్మీభార్గవి పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా లక్ష్మీభార్గవి మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రీస్కూల్‌లో చదివి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు,, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త దేవకరుణ, ఆయా, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వత్సవాయి మండలం చిన్నమోదుపల్లిలో చిన్నారులను సత్కరిస్తున్న సీడీపీవో లక్ష్మీభార్గవి

ఇరిగేషన్ మంత్రికి వినతిపత్రం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: వత్సవాయి మండలంలోని పోలంపల్లి వద్ద మునేటి పాత ఆనకట్టకు పడిన గండి పూడ్చివేతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడును విజయవాడలో గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పోలంపల్లి వద్ద మునేరు పాత ఆనకట్టకు పడిన గండిని గురించి వివరించగా, సమస్య పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గంగయ్య, డీఈ రామకృష్ణ, నాయకులు, రైతులు వేగినేటి గోపాలకృష్ణ, యార్లగడ్డ విశ్వనాథం, పొన్నం బాలాజీ, చల్లా తులిశారావు, నేలవెల్లి సిద్దార్థ, ముప్పా చంద్రమౌళి పాల్గొన్నారు.



మంత్రి రామానాయుడుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

ప్రమాదభరితంగా ఎండిన చెట్టు



మక్కపేట(వత్సవాయి) : మండలంలోని మక్కపేట–పెనుగంచిప్రోలు వెళ్లే ప్రధాన రహదారిలో రైల్వేకట్ట సమీపంలో ఎండిపోయిన చెట్టు ప్రమాదభరితంగా మారింది. నిత్యం ఈ మార్గం గుండా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా శుక్ర, ఆదివారాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి పెనుగంచిప్రోలు అమ్మవారి దర్శనానికి రావాలంటే భక్తులు ఈ మార్గం గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే ఈ రోడ్డులో మక్కపేట వద్ద రోడ్డు పక్కన ఎండిపోయిన చెట్టు ఎప్పుడు నేల కూలుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడం, గాలిదుమ్ములు వస్తుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్టును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి : సీపీఐ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో కొన్నిరోజులుగా ప్రమాదకరమైన వాంతులు, విరోచనాలతో ఎక్కువమంది ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నందున ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రజారోగ్య సంరక్షణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ డిమాండ్ చేశారు. స్థానిక పద్మావతినగర్‌లోని హెడ్ వాటర్ వర్క్స్, పేట ప్రభుత్వాస్పత్రిని గురువారం వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాంతులు, విరోచనాలతో అనేక మంది రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నప్పటికీ వారికి సరైన వైద్యం అందడంలేదన్నారు. సరైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడం, ఓవర్ హెడ్ ట్యాంకులను సరిగా శుభ్రం చేయించకపోతుండటంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారన్నారు. మురికినీటి డ్రెయిన్లలో నుంచి వెళ్లే తాగునీటి పైపులైన్లు లీకేజీలకు గురై నీరు కలుషితమవుతోందన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచడంతోపాటు ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు మెటికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పేటలోని హెడ్‌వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రాజశ్యామల యాగం ప్రారంభం

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపైగల త్రిశక్తి పీఠంలో రాజశ్యామల యాగాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరగనున్న ఆలయ 9వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో గణపతి పూజతోపాటు మండపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాజ శ్యామల సహిత రుద్రహోమం చేశారు. పలువురు వేద పండితుల ఆధ్వర్యంలో పొద్దుపోయేవరకు హోమాధి కార్యక్రమాలు జరిగాయి. ఆయా పూజా కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



గుమ్మడిదూర్రులో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచి కమల



ముండ్లపాడులో కిట్లు పంపిణీచేస్తున్న వైఎస్ ఎంపీపీ వాసు, మధు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని సర్పంచి నక్కా కమల అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు బ్యాగ్, యూనిఫాంతో కూడిన కిట్లను గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన విద్య అందిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సాహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై పేర్కొన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఊటుకూరి సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముండ్లపాడులో...

గ్రామంలోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఉప సర్పంచి గుత్తా శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొర్రెపాటి మధు, గ్రామనాయకులు ఉమ్మినేని పుల్లారావు, చంద్రుపట్ల లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లూరులో..

అల్లూరు(వీరులపాడు):విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్యతో కలిసి మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆమె స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చదువుతో ఉన్నత శిఖరాలను సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి బందెల రాణి, ఉప సర్పంచి బెల్లం నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మొండ్రు బాయమ్మ, నాయకులు రాజగోపాల్ రెడ్డి, కోటేరు సూర్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



అల్లూరులో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ కీర్తిసౌజన్య

వైఎస్ జగన్‌ను కలిసిన జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి జగన్‌మోహనరావు హాజరయ్యారు. నందిగామ నియోజకవర్గంలో ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల సరళి, పోలింగ్, ఓట్ల లెక్కింపుపై తదితర అంశాలను డాక్టర్ జగన్‌మోహనరావు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. అనంతరం డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. ప్రజల స్వరంగా మారి పనిచేద్దామని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నందిగామ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మరింత అండగా ఉంటానని పేర్కొన్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నీతి ఆయోగ్ లక్ష్యాల సాధనపై సమీక్ష

పెనుగంచిప్రోలు: అన్నిశాఖల అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆస్పిరేషన్ బ్లాక్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ సమీక్షా సమావేశాన్ని మండల బ్లాక్ కో–ఆర్డినేటర్ మోహన్ సందీప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నీతి ఆయోగ్ సీఈవో సూచనల ప్రకారం ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, సోషల్ డెవలప్‌మెంట్ విభాగాలకు సంబంధించిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీవో కె.లక్ష్మీభార్గవి, వైద్యాధికారి పి.ఇందిర, ఏవో కె. రామసుబ్బారెడ్డి, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఎంఈవో రవీంద్ర, ఇరిగేషన్ జేఈ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సాయిహర్ష, హాజరైన అధికారులు

సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

నందిగామ: నియోజకవర్గంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు మధ్యాహ్న భోజనపథకం కార్మికులు గురువారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. 23ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పని చేస్తున్నామని, మా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినవారిలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి సుప్రజ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్, సుశీల, సత్యవతి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజనపథకం కార్మికులు

పాలిటెక్నిక్‌తో విస్తృత ఉద్యోగావకాశాలు



సదస్సుకు హాజరైన పాలిటెక్నిక్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ రామ్మోహనరావు

కంచికచర్ల : పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు అనేక ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయని పరిటాల అమిత్రసాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ వివరించారు. అమిత్రసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది పాలిటెక్నిక్ కోర్సులో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రామ్మోహనరావు, డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రణాళికతో పాటు కళాశాలలోని ప్రయోగశాలల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవచ్చన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. పాలిటెక్నిక్ కోర్స్ పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇండియన్ ఆర్మీ, రైల్వే, ఎయిర్‌లైన్స్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో సంస్థలతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరుల పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

విజయవాడకల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద గురువారం అంబేడ్కర్ స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన డేవిడ్‌రాజు మాట్లాడుతూ భారత జాతిని ప్రగతి పథం వైపు నడిపించిన మహనీయుడు అంబేడ్కర్ అని అభివర్ణించారు. స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి బీవీ వీరభద్రరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సాంస్కృతిక సంస్థ ద్వారా యువత భవిష్యత్తుకు వర్క్ షాపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, మాంతి రమణ, మారేపల్లి జోషి, పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్ ప్రసంగించారు. ప్రమీలా రాణి, మల్లీశ్వరి, శ్యాం ప్రసాద్ కృష్ణ సింధూతోపాటు పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంబేడ్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, వేదికమీద వీరభద్రరావు, చిట్టిబాబు, మల్లీశ్వరి తదితరులు

■ ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నర్తన నటరాజ నాట్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు గురువారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళాబృందానికి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు.